మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

30.1.2026 శుక్రవారం Friday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 281 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## బయటపడ్డ భారత్ బలహీనత!




07

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# దేశ అభివృద్ధే లక్ష్యంగా నిర్ణయాలు

**ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ**

**రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య**

వివరాలు 3లో

పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు.

4

# జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి

**పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే**

**ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్**



దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు మధ్యాహ్నం విచారణకు రావాలని సిట్ ఆదేశం**

**వయసు దృష్ట్యా విచారణ ఇంట్లోనా.. సిట్ ఆఫీసులోనా ఎంచుకునే చాన్స్ కేసీఆర్‌కే**

**రాధాకిషన్‌రావు తదితరులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నించేందుకు సిద్ధం**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే.



## నేటి విచారణకు రాలేను

మున్సిపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా
ఇకముందు విచారణకు సహకరిస్తా
నోటీసులను ఎర్రవల్లికి పంపించండి
విచారణ కూడా ఇక్కడే చేపట్టాలి
సిట్ నోటీసులకు కేసీఆర్ సమాధానం

## సిట్ నోటీసులు కక్షసాధింపు చర్య

**ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు**

**ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు**




03

## కేసీఆర్‌కు నోటీసులపై మండిపడ్డ బీఆర్ఎస్

కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్టగా విమర్శలు
రేవంత్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం
మండిపడ్డ పలువురు మాజీ ఎమ్మెల్యేలు




## హెచ్-1బీ వీసాల దుర్వినియోగం

విచారణకు దిగిన టెక్సాస్

.. వివరాలు 4లో



## అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐల విషయంలో జాగ్రత్త పడాలి

కేంద్రాన్ని హెచ్చరించిన ఆర్థిక సర్వే

.. వివరాలు 4లో



## ఖర్గే, రాహుల్‌తో థరూర్ భేటీ

కేరళ అసెంబ్లీ ఎన్నికలపై నేతల చర్చ

.. వివరాలు 4లో

# మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి భూసేకరణ పూర్తి

**విమానాశ్రయాల అథారిటీకి భూముల అధికారిక అప్పగింత**

చరిత్రలో నిలిచిపోయే రోజ అన్న డిప్యూటి సీఎం

ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టులను త్వరితగతన పూర్తి చేయాలి

బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

కాకతీయ కళ ఉట్టిపడేలా విమానాశ్రయం నిర్మిస్తామన్న రామ్మోహన్ నాయుడు





03

## అదృష్టంతో విజయం వరించదు

**కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం**

గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం

హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సీఎం రేవంత్

# అశ్రునయనాల మధ్య అజిత్ అంత్యక్రియలు

**ప్రభుత్వ లాంఛనాలతో దివంగత నేతకు వీడ్కోలు**


**కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి**

**జనతా న్యూస్, ముంబై :** అశ్రు నయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు.. కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్

మిగతా 4 లో



# కదిలివచ్చిన సమ్మక్క తల్లి!



సల్లంగ చూసేందుకు మేడారం గద్దెపైకి

చిలుకలగుట్ట నుంచి గద్దెలపైకి చేరుకున్న వనదేవత

భక్తజన సంద్రంగా మేడారం

లక్షలాదిగా తరలివస్తున్న జనం

2



## దేశంలనే అతి పెద్ద గిరిజనుల పండగ

**కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం**

కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల ప్రత్యేక పూజలు


## స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

**కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు**

టీవీ సిరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్

మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు

మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్





# మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి భూసేకరణ పూర్తి

**హైదరాబాద్,జనవరి 29 :** వరంగల్ మామునూరు విమానాశ్రయ అభివృద్ధి కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. సేకరించిన భూములను నేడు బేగంపేట్ విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్ మోహన్ నాయుడుకు అధికారికంగా అప్పగించారు. ఈ భూముల అప్పగింత కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విమానయాన విభాగం డైరెక్టర్ భరత్ రెడ్డి హాజరయ్యారు. అలాగే రవాణా, రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రోడ్లు / భవనాలు మరియు రవాణా శాఖల సీనియర్ అధికారులు, భారత విమానాశ్రయాల అథారిటీ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్ మోహన్ నాయుడు మాట్లాడుతూ, దేశంలో ప్రాంతీయ వైమానిక అనుసంధానాన్ని విస్తృతంగా పెంచుతూ సామాన్య ప్రజలకు విమాన ప్రయాణాన్ని సులభతరం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మామునూరు విమానాశ్రయాన్ని త్వరితగతిన కార్యాచరణలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. భూసేకరణను సమయపాలనతో, సమర్థవంతంగా పూర్తి చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. భూముల అప్పగింత అనంతరం మామునూరు విమానాశ్రయ అభివృద్ధి వ్యయం మొత్తాన్ని భారత విమానాశ్రయాల అథారిటీ భరిస్తుందని తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టులో 2,500 మీటర్ల రన్‌వే, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, అగ్నిమాపక మరియు భద్రతా సదుపాయాలు, అనుబంధ మౌలిక వసతుల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి 2 నుండి 2.5 సంవత్సరాలలో విమానాశ్రయాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మామునూరు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని కాకతీయుల శిల్పకళా, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపకల్పన చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మామునూరు విమానాశ్రయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తు చేశారు. నిజాం పాలన కాలంలో 1930లో నిర్మితమైన ఈ విమానాశ్రయం స్వాతంత్ర్యానికి ముందు దక్షిణ భారతదేశంలో అతిపెద్ద విమానాశ్రయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఒకప్పుడు ప్రధాన వైమానిక కేంద్రంగా ఉన్న మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరించడం ద్వారా వరంగల్ చారిత్రక ప్రాధాన్యతను తిరిగి తీసుకురావడంతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భూసేకరణను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, వరంగల్ (మామునూరు) విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు అవసరమైన అన్ని అనుమతుల పక్రియ పూర్తిచేసి, వాటి క్లియరెన్స్ సర్టిఫికెట్లను కేంద్ర పౌర విమానయాన శాఖకు అందజేయడం గర్వకారణమని తెలిపారు. దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక విమానాశ్రయానికి, ప్రస్తుత ముఖ్యమంత్రి వరంగల్‌ను అభివృద్ధి కేంద్రంగా, రెండవ రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రాధాన్యం కల్పించారని పేర్కొన్నారు. రైతులను ఒప్పించి, వారికి న్యాయం చేస్తూ భూసేకరణ పూర్తిచేయడం రాష్ట్ర ప్రభుత్వ సమిష్టి కృషి ఫలితమని అన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా పరిశ్రమలు, టెక్స్టైల్ పార్కులు, కార్గో రవాణా, పర్యాటకం విస్తరించి వరంగల్–?కరీంనగర్, వరంగల్–ఖమ్మం, వరంగల్–హైదరాబాద్ కారిడార్ల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుతం ఒక్కటే విమానాశ్రయం ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ విమానాశ్రయాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు తీసుకెళ్లినందుకు కేంద్ర పౌర విమానయాన శాఖకు రాష్ట్ర ప్రభుత్వ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, రైతుల సహకారంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వరంగల్ ప్రజల కలను నెరవేర్చడంలో కీలక ముందడుగు పడిందన్నారు. ఇదే విధంగా కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలు ఇప్పటికే సమర్పించామని, కేంద్రం నుంచి సాధ్యాసాధ్యత అనుమతులు లభించిన వెంటనే భూసేకరణ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం భూమిని అప్పగిస్తుందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ మరియు అభివృద్ధి ద్వారా ఉత్తర తెలంగాణలో వైమానిక అనుసంధానం బలోపేతం కావడంతో పాటు వాణిజ్యం, పర్యాటకం మరియు సమగ్ర సామాజిక?ఆర్థిక అభివృద్ధికి గణనీయమైన దోహదం చేకూరనుంది. రాష్ట్రంలోని ఒక చారిత్రక వైమానిక వారసత్వ కేంద్రం తిరిగి పునరుజ్జీవనం పొందనుంది.

# కదిలివచ్చిన సమ్మక్క తల్లి!

**సల్లంగ చూసేందుకు మేడారం గద్దెపైకి**

**చిలుకలగుట్ట నుంచి గద్దెలపైకి చేరుకున్న వనదేవత**

**భక్తజన సంద్రంగా మేడారం**

**లక్షలాదిగా తరలివస్తున్న జనం**



**మేడారం, జనవరి 29 :** తన భక్తుల మీద వరములు చిలకరించేందుకు చిలుకలగుట్ట నుంచి కదిలివచ్చింది సమ్మక్క తల్లి! తనను నమ్ముకున్న భక్తులకు కష్టాల చీకట్లను తరమికొట్టి, వారిని సల్లంగ చూసేందుకు చల్లని పున్నమి వెన్నెల కాంతుల నడుమ మేడారం గద్దెపై ఆసీనురాలైంది. ఈ అపూర్వ ఘట్టాన్ని వీక్షించిన భక్త జనులు ఆనందపారవశ్యంతో 'జై సమ్మక్క.. జైజై సమ్మక్క' అంటూ జయజయధ్వానాలు చేశారు. ఇలా రెండోరోజైన గురువారం మేడారంలో అత్యంత కీలక ఘట్టం పూర్తవ్వడంతో మహాజాతర పతాకస్థాయికి చేరింది. డోలూ సన్నాయి వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ సరిగ్గా రాత్రి 9:47 గంటలకు సమ్మక్క గద్దెపైకి చేరుకుంది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు బుధవారమే గద్దెలపైకి చేరుకున్నారు. సమ్మక్క రాకతో నలుగురు దేవతలు ప్రభుత్వం ఆధునికీకరించిన గద్దెలపై కొలువుదీరడంతో జాతర పరిపూర్ణతను సంతరించుకుంది. సమ్మక్కను గద్దెపైకి చేర్చే కార్యక్రమంలో గిరిజన పూజారులు తెల్లవారుజాము నుంచే నిమగ్నమయ్యారు. తెలతెలవారుతుండగానే మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకొని ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పేడతో చక్కగా అలికి.. తోరణాలు కట్టి.. ముగ్గులు వేశారు. అడవికి వెళ్లి వనాన్ని తీసుకొచ్చారు. ఉదయం 9 గంటలకు డప్పుచప్పుళ్ల మధ్య వనాన్ని తీసుకొస్తుండగా సమ్మక్క గుడి సమీపంలో బొడ్రాయి వద్ద మహిళలు నీళ్ల బిందెలతో ఎదురొచ్చి పూజారుల కాళ్లు కడిగారు. మంగళహారతులు పట్టారు. వనం తీసుకువచ్చే కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మధ్యాహ్నం పూజారి సిద్దబోయిన మునేందర్ ఇంట్లో ఆడేరాలను (పసిడి కుండలు) సిద్ధం చేశారు. డోలు వాయిద్యాల మధ్య వాటిని సమ్మక్క గుడికి తరలించారు. గుడిలో తల్లికి సంబంధించిన మిగతా పూజా సామగ్రిని శుద్ధి చేశారు. పూజల అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు. అనంతరం సాయంత్రం ఐదింటికి ప్రధాన పూజారి అయిన కొక్కెర కృష్ణయ్య, మరో ఆరుగురు పూజారులు మాల్యాల సత్యం, సిద్దబోయిన మునీందర్, సిద్దబోయిన బొక్కన్న, కొమ్ము స్వామి, కొమ్ము జనార్దన్.. చిలుకల గుట్టకు బయలుదేరారు. గుట్టపైకి కొంత దూరం వెళ్లాక ప్రధాన పూజారి మిగతా వారు ఆగిపోగా.. కృష్ణయ్య ఒక్కరే గుట్ట పైభాగాన తల్లి స్థావరం వద్దకు వెళ్లారు. అక్కడ సుమారు రెండు, మూడు గంటల పాటు ఆయన రహస్య పూజలు నిర్వహించారు. ఆ తర్వాత తల్లి రూపమైన కుంకుమ భరిణను తీసుకొని బయలుదేరారు. మార్గమధ్యలో వేచివున్న మిగతా పూజారులతో కలిసి కిందకు బయలుదేరారు. మంత్రులు సీతక్క, పొంగులేటి, అడ్లూరి లక్ష్మణ్, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో పాటు వేలసంఖ్యలో భక్తులు ఎదురుచూస్తుండగా భరిణ రూపంలో ఉన్న సమక్కతో పూజారులు వచ్చారు. సమ్మక్కతల్లి రాకను పురస్కరించుకొని, ఆ తల్లికి గౌరవ సూచకంగా ములుగు ఎస్పీ సుధీర్ ఏకే 47తో గాల్లోకి నాలుగు రౌండ్లు పేల్చి వందనం సమర్పించారు. అనంతరం చిలుకల గుట్ట ప్రధాన ద్వారం వద్ద మరోదఫా మూడు రౌండ్లు గాల్లోకి పేల్చి తల్లి వస్తున్నట్టుగా భక్తులకు సంకేతాలు పంపారు. సమ్మక్కను పూజారులు మార్గమధ్యలో మేడారంలోని ఆమె గుడికి తీసుకువెళ్లారు. అక్కడ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సమ్మక్కను అక్కడి నుంచి తరలివస్తుండగా తల్లిని దర్శించుకునేందుకు దారి పొడవునా వేలాది మంది భక్తులు బారులు తీరి నిల్చున్నారు. పూజారులతో పాటు గద్దెల వరకు వెంటనడిచారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. తల్లి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పూజారులు తల్లిని గద్దెపై ప్రతిష్టించే సమయంలో భక్తుల దర్శనాలను కొద్దిసేపు నిలిపివేశారు. కరెంట్ సరఫరాను కూడా బంద్ చేశారు. సమ్మక్కను గద్దెపై నిలిపిన తర్వాత పది నిముషాల పాటు రహస్య పూజలు నిర్వహించి వెనుదిరిగిన తర్వాత తల్లి దర్శనానికి అనుమతిచ్చారు.

# మేడారం జాతర గిరిజనుల మహాకుంభమేళా

**దేశంలనే అతి పెద్ద గిరజనుల పండగ**

**కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం**

**కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల ప్రత్యేక పూజలు**



**మేడారం,జనవరి 29 :** మేడారం సమ్మక్క–సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్–మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి 80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సమ్మక్క–సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ

గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంబించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు మధ్యాహ్నం విచారణకు రావాలని సిట్ ఆదేశం**

**వయసు దృష్ట్యా విచారణ ఇంట్లోనా.. సిట్ ఆఫీసులోనా ఎంచుకునే చాన్స్ కేసీఆర్‌కే**

**రాధాకిషన్‌రావు తదితరులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నించేందుకు సిద్ధం**

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణకు సిద్ధంగా ఉండాలంటూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామమని సిట్ ఏసీపీ వెంకటగిరి.. నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసు కాపీని సిట్ అధికారులు.. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వెళ్లి, అక్కడి సిబ్బందికి అందజేశారు. "పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024లో క్రైం నంబర్ 243 కింద నమోదైన క్రిమినల్ కేసు విచారణలో భాగంగా వెల్లడైన అంశాల్లో మీ పాత్రకు సంబంధించి విచారణ జరపాల్సి ఉంది" అని.. 160 సీఆర్‌పీసీ కింద ఇచ్చిన ఈ నోటీసులో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. అయితే, కేసీఆర్ వయసు రీత్యా హైదరాబాద్ పరిధిలో ఆయన కోరిన స్థలంలో దర్యాప్తు అధికారి, ఆయన బృందం విచారణ చేపడతారని, లేదా ఆయన సిట్ కార్యాలయానికి హాజరుకావచ్చని.. ఏ విషయాన్నీ దర్యాప్తు అధికారికి తగు ముందస్తు వ్యవధిలో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు అరెస్టు అయిన పోలీసు అధికారులు..

టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎస్ఐబీ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల వాంగ్మూలాల్లో పలుచోట్ల తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని, పెద్దాయన ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేశామని చెప్పారు. నాటి సీఎంవో గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావును విచారించినప్పుడు.. తనకు పైనుంచి ఆదేశాలు అందిన విషయాన్ని ఆయన అంగీకరించారు. దీంతో ఆ ఆదేశాలెవరు ఇచ్చారన్న విషయాలను తెలుసుకోవడానికి కేటీఆర్, హరీశ్, సంతోషలను సిట్ అధికారులు ఇటీవల విచారించారు.

## నేటి విచారణకు రాలేను


**మున్సిపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా**

**ఇకముందు విచారణకు సహకరిస్తా**

**నోటీసులను ఎర్రవల్లికి పంపించండి**

**విచారణ కూడా ఇక్కడే చేపట్టాలి**

**సిట్ నోటీసులకు కేసీఆర్ సమాధానం**



హైదరాబాద్,జనవరి 29 : సిట్ నోటీసులపై తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు స్పందించారు. ఈ మేరకు గురువారం సిట్ అధికారులకు ఆయన లేఖ రాశారు. నేటి విచారణకు హాజరు కాలేనని ఆ లేఖలో కేసీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. ఆ లేఖలో కేసీఆర్ ఇంకా ఏమన్నారంటే.. 'మున్సిపల్ ఎన్నికల నామినేషన్ పక్రియలో బిజీగా ఉన్నాను. నామినేషన్ల దాఖలుకు రేపే ఆఖరి రోజు. పలువురు అభ్యర్థులకు బీఫాంలు ఇవ్వాల్సి ఉంది. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతా' అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని సిట్ ఇచ్చిన నోటీసులకు కేసీఆర్ స్పందించారు. సిట్ నోటీసులకు కేసీఆర్ ప్రత్యుత్తరం పంపారు. శుక్రవారం విచారణ రాలేనని పోలీసులకు తెలిపారు. తనను ఎర్రవల్లిలో విచారణ చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు రేపే చివరి తేదీ అయినందున విచారణకు రాలేనని వివరించారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేసీఆర్ వెల్లడించారు. 160 సీఆర్‌పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలన్న నిబంధనలు లేవని పేర్కొన్నారు. భవిష్యత్తులో నోటీసులన్నింటిని ఎర్రవల్లికే పంపాలని ప్రత్యుత్తరంలో కేసీఆర్ కోరారు.

సిట్ అధికారులు గురువారం తనుకు నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు నందినగర్‌లోని నివాసంలో అందుబాటులో ఉండాలని వారు కోరారు. అయితే.. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు శుక్రవారమే ఆఖరు తేదీ కావడంతో.. అభ్యర్థులను ఖరారు చేయడంతో తాను బిజీగా ఉన్నానని విచారణను మరోరోజు జరపాల్సిందిగా కేసీఆర్ పోలీసులకు తెలిపారు. జూబ్లిహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి శుక్రవారం తాను హాజరు కాలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ రెండు పేజీల లేఖ రాశారు. సెక్షన్ 160 సీఆర్పీసీ ప్రకారం మరో రోజున తనను ఎర్రవల్లిలోని నివాసంలో విచారించాలి. అంతేకాదు ఈ సెక్షన్‌లోని నిబంధనల మేరకు నాకు మీరు ముందస్తు నోటీసులు పంపించి ఆ తర్వాతే విచారించాలి. మరో విషయం 65 ఏళు పైబడిన పురుషులను వారు విచారణ కోసం పోలీస్ స్టేషన్ వెళ్లనవసరం లేదు. పోలీసులే వారి ఇంటివద్దకు వెళ్లి విచారణ చేపట్టాలి. ఇకపై నాకు పంపాల్సిన నోటీసులను నేను నివసిస్తున్న ప్రాంతానికి అంటే.. ఎర్రవల్లికే పంపాలి. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తాను అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

# కేసీఆర్‌కు నోటీసులపై మండిపడ్డ బీఆర్ఎస్

**కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్టగా విమర్శలు**

**రేవంత్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం**

**మండిపడ్డ పలువురు మాజీ ఎమ్మెల్యేలు**



**హైదరాబాద్,జనవరి 29 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడంపై ఆ పార్టీ వర్గాలు మండిపడ్డాయి. ఇది పూర్తిగా కక్షపూరిత రాజకీయమని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే అని హెచ్చరించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో

రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేసే ప్రయత్నమేనని మండిపడ్డారు. పరిపాలనలో చేతకానితనంతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు, సిట్ పేరుతో నోటీసులు జారీచేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని హరీష్‌రావు విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది పొందవచ్చని భావించడం రేవంత్‌రెడ్డి రాజకీయ దివాళాకోరు తనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చరిత్రను సృష్టించిన నాయకుడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని హరీష్‌రావు మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు ఇదే నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ అధికార దుర్వినియోగనికి పరాకాష్ట అని మండిపడ్డారు. పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్లు పాలకులుగా ఉండటం దురదృష్టకరమని.. నియంతృత్వ పోకడలకు ప్రజలే అడ్డుకట్టవేస్తారని క్రాంతి కిరణ్ అన్నారు. కేసీఆర్ కీర్తిని దిగజార్చాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ నోటీసులు జారీ చేసిందని మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ తెచ్చిన ధీరుడికి కేసులు, కొట్లాట, కోర్టులు కొత్తకాదు అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడిన వీరుడు కేసీఆర్. ఈ కాంగ్రెస్ నేతల సిట్, బొట్‌లకు భయపడబోరన్నారు. న్యాయస్థానాల మీద, వ్యవస్థ మీద నమ్మకం ఉందన్నారు. కమిషన్లు, సిట్‌లు, కేసులులకు అదరం బెదరమన్నారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేకనే సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపారని మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్య సాధింపు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ వరుస స్కాంల నుంచి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు ఇచ్చిందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉ ంటారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజం అంతా ఉ ంది. మీ కేసులకు, నోటీసులకు భయపడేది లేదు. అక్రమ కేసులపై ప్రజా క్షేత్రంలోనే బీఆర్ఎస్ తేల్చుకుంటుందని స్పష్టం చేశారు.

## నోటీసులు కక్షసాధింపు చర్య

**ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు**

**ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు**

**హైదరాబాద్,జనవరి 29 :** విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉ ద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.'చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్దాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

**స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానం అవలంబిస్తున్న తెలంగాణ**

**నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు**

**గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు**

**త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తాం**

**కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలు**

**గాలి నాణ్యత సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్,జనవరి 29 :** పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు వెళుతుందని అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగం లో 'గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు. నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు.అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు.÷స్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు, అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు,అది ప్రజారోగ్య సూచీ, అది ఉత్పాదకత సూచీ మరియు అది ఆర్థిక సూచీ కూడా అన్నారు. 2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు. నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందనీ, ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు. ఇది మన పిల్లలను, వృద్ధులను, పని చేసే జనాభాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందనీ అన్నారు. ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతోంది, అందుకే శుభ్రమైన గాలి గురించి మాట్లాడినప్పుడు, మనం మనుషుల జీవితాల గురించి,ఆర్థిక బలంపై, సామాజిక శ్రేయస్సు గురించి మాట్లాడుతున్నాం అన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం,కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.తెలంగాణ ప్రభుత్వం లక్ష్యాధారితమైన, శాస్త్రీయమైన విధానాన్ని అనుసరిస్తోంది అందులో భాగంగా మొదటి అంశం పర్యవేక్షణ అన్నారు. 2024లో గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను రెట్టింపు చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం. దీని ద్వారా రియల్‌టైమ్, విశ్వసనీయ డేటా అందుతుందని తెలిపారు. 2025లో రాష్ట్ర గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి ప్రధాన కాలుష్య మూలాలను ఈ ప్రణాళిక పరిష్కరిస్తోంది. ఇది ఇప్పటికే అమలులో ఉందనీ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు అందిస్తున్నాం. ఈ–బస్సులు, మెట్రో విస్తరణ ద్వారా ప్రజా రవాణాను బలోపేతం చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులు నిర్మిస్తున్నాం. పాత, కాలుష్యకర వాహనాలను తొలగించేందుకు రిజిస్టర్డ్ వాహన స్క్రాపింగ్ కేంద్రాలను ప్రారంభించాం అని వివరించారు.

పరిశ్రమల ఉద్గారాలను నిరంతర పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి సర్వర్లకు అనుసంధానించామని. శుభ్రమైన ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, అలాగే నియమావళి అమలును కఠినతరం చేస్తున్నాం అని భట్టి వివరించారు. 2025 పునరుత్పాదక శక్తి విధానం ద్వారా 2030 నాటికి సౌర, గాలి, గ్రీన్ హైడ్రజన్ ద్వారా 20,000 మెగావాట్ల లక్ష్యాన్ని నిర్దేశించాం. ఇది కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు సుమారు 32 శాతం కాలుష్యానికి కారణమవుతున్నాయని ప్రజెంటేషన్ వెల్లడించిందనీ తెలిపారు. నేరుగా వచ్చే ధూళి కణాలపై నియంత్రణ ఉన్నప్పటికీ, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ వంటి ఇతర కాలుష్యాలపై మరింత దృష్టి సాధించాల్సిన అవసరం ఉంది అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం ఉదాహరణగా మనం చూశాం. ఒకప్పుడు నగర చివరన ఉన్న పరిశ్రమలు నేడు నివాస ప్రాంతాల మధ్య ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు ఆర్ఆర్ఆర్ లోపల అనేక ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఉ న్నాయి అన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భద్రత, ఆరోగ్య పరంగా తీవ్రమైన ప్రమాదాలను సృష్టిస్తుంది అని పేర్కొన్నారు. నివాస ప్రాంతంలో జరిగే పరిశ్రమల ప్రమాదం పెద్ద విపత్తుగా మారవచ్చు అన్నారు. కాబట్టి పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ, జోనింగ్ సంస్కరణలు, మెరుగైన భూ వినియోగ ప్రణాళికలను తీవ్రంగా పరిశీలించాలి అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే గాలి నాణ్యత డ్యాష్‌బోర్డును త్వరలో ప్రారంభించాలని భావిస్తున్నాం అని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కాలుష్య ఫిర్యాదులకు వేగంగా స్పందించేందుకు ప్రత్యేక చర్యల బృందాలను ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తాం, ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆ కేంద్రాలను విస్తరిస్తాం అన్నారు.ఈ సదస్సు జాతీయ, అంతర్జాతీయ నిపుణులను ఒక వేదికపైకి తీసుకొచ్చింది. వారి అనుభవం, డేటా, ఆవిష్కరణలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి అన్నారు. సంబంధిత శాఖలన్నీ ఈ ఉత్తమ విధానాలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అధ్యయనం చేసి అమలు చేయాలని కోరుతున్నాను అని తెలిపారు.




# అదృష్టంతో విజయం వరించదు

**కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం**

**గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం**

**హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సిఎం రేవంత్**

హైదరాబాద్,జనవరి29 : విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సిఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు . ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేథస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

# వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నంలో సిట్

**కెసిఆర్‌కు నోటీసులపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్**

**హైదరాబాద్,జనవరి29 :** జరిగిన వాస్తవాలు తెలుసుకోవడానికి సిట్ ఎవరికైనా నోటీసులు ఇవ్వొచ్చని స్పష్టం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేశారు. సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే తెలుస్తుందని.. నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. ఈ విషయంలో వాస్తవాలు వెలుగులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకుండా అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడరని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఎవరు భాగస్వాములో తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో పారదర్శక విచారణ జరగాలని కోరారు మహేశ్ కుమార్. 500కు పైగా ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేశారనే సమాచారం ఉందని చెప్పుకొచ్చారు.

# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

**కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు**

**టీవీ సిరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్**

**మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు**

**మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్**



**న్యూఢిల్లీ,జనవరి 29 :** తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగుపరచడానికి కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఒక వర్గాన్ని సంతోషపరచడం కోసమే పని చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. ఓ ఫెయిల్యూర్ నాయకుడు అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి

## పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే

## ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ :** దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగు తోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# హెచ్-1బీ వీసాల దుర్వినియోగం

## విచారణకు దిగిన టెక్సాస్

**న్యూయార్క్:** హెచ్-1బీ వీసాల దుర్వినియోగం ఆరోపణలపై టెక్సాస్ చర్యలు చేపట్టింది. స్థానికంగా ఉన్న కొన్ని సంస్థలను లక్ష్యంగా చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టింది. ఈ మేరకు టెక్సాస్ ఆఫీస్ ఆఫ్ అటార్నీ జనరల్ తాజాగా ఓ ప్రకటనను విడుదల చేసింది. ఉత్తర టెక్సాస్‌కు చెందిన మూడు సంస్థలకు సివిల్ ఇన్వెస్టిగేషన్ డిమాండ్స్ జారీ చేసినట్లు అటార్నీ జనరల్ కెన్ పాక్స్టన్ ఆ ప్రకటనలో వెల్లడించారు. దీంతో ఆ కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, నియామక విధానాలకు సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు 'ఘోస్ట్' సంస్థలను సృష్టించి హెచ్-1బీ వీసాలను పొందేందుకు మోసపూరిత విధానాలను అనుసరించి ఉంటారని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే, ఆ కంపెనీలు ఏంటనే వివరాలను మాత్రం అటార్నీ జనరల్ కార్యాలయం వెల్లడించలేదు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగంపై పెద్దఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ.. టెక్సాస్ ఈ దర్యాప్తు చేపట్టడం స్థానికంగా ప్రాధాన్యం సంతరించు కుంది. ఇప్పటికే కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులను తక్షణం నిలిపివేయాలని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. హెచ్-1బీ వీసాల జారీ దుర్వినియోగం అవుతోందని, స్థానిక ఉద్యోగాలు అమెరికన్ కార్మికులకే చెందాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రెగ్ అబాట్ ప్రకటించారు. 2027 మే 31 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందన్నారు.

# అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

## టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐల విషయంలో జాగ్రత్త పడాలి

## కేంద్రాన్ని హెచ్చరించిన ఆర్థిక సర్వే

**న్యూఢిల్లీ :** వస్తువులు, సేవల విషయంలో అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐ, ట్రేడ్ కంట్రోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. లేదంటే అమెరికా, చైనా దేశాల మధ్య భారత్ క్రాస్ ఫైర్ అవ్వక తప్పదని తెలిపింది. కేంద్ర బడ్జెట్ 2026 - 27 సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో 'ది ఎకనామిక్ సర్వే 2025 - 26' భారత్‌ను హెచ్చరించింది. అమెరికా, చైనాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఎకనామిక్ సర్వే ప్రకారం.. ప్రపంచ రాజకీయాల్లో చైనా, అమెరికా దేశాల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. చైనాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని అమెరికా.. అమెరికాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని చైనా పావులు కదుపుతున్నాయి. అమెరికా ఆధిపత్యం సాగిస్తున్న రంగాలపై చైనా దృష్టి సారించింది. అమెరికా కూడా అదే పని చేస్తోంది. ఒకే విధమైన ఆలోచనలు ఉన్న దేశాలను కలుపుకొని సెక్యూర్ ఏఐ ఎకోసిస్టమ్‌ను తయారు చేయాలని అమెరికా చూస్తోంది. సాధారణంగా అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్రిటికల్ ఏపీఐలు, సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో ఆధిపత్యం కొనసాగిస్తున్న దేశాలే ప్రపంచ రాజకీయాల్లో పవర్‌ను కలిగి ఉంటాయి. భారత్ ఈ రెండు దేశాలపై ఆధారపడటం తగ్గించాలి. వస్తువులు లేదా సేవల విషయంలో ప్రత్యామ్నాయం లేని దేశంగా తప్పకుండా ఎదగాల్సిన అవసరం ఏంతైనా ఉంది. అలా చేయకపోతే ప్రపంచ రాజకీయాల్లో భారత్ పట్టు కోల్పోతుంది. అమెరికా, చైనాల మధ్య జరిగే గొడవల వల్ల భారత్ ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. చైనా గనుక దిగుమతులపై ఆంక్షలు విధించినా లేదా ధరల్ని పెంచినా దాని ప్రభావం భారత తయారీ రంగంపై తీవ్రంగా ఉంటుంది. అలాగే అమెరికా.. పాలసీలను కఠినతరం చేస్తే దాని ప్రభావం భారత సర్వీస్ సెక్టార్‌పై తీవ్రంగా ఉంటుంది.

# దేశ అభివృద్ధే లక్ష్యంగా నిర్ణయాలు

## ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ

## రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య




**న్యూఢిల్లీ :** పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగంతో ప్రారంభమ య్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ÷ూష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్- ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందు కెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ది పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

# అశ్రునయనాల మధ్య అజిత్ అంత్యక్రియలు





మొదటి పేజీ తరువాయి


శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఏపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మరణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి నుంచి.. కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి

ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

# ఖర్గే, రాహుల్‌తో థరూర్ భేటీ

## కేరళ అసెంబ్లీ ఎన్నికలపై నేతల చర్చ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీలతో సమావేశమయ్యారు. బుధవారం పార్లమెంటులో ఖర్గే కార్యాలయంలో కొన్ని గంటలపాటు ఈ సమావేశం జరిగింది. గతవారం కేరళలో జరిగిన కీలక సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. దీంతో శశిథరూర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారని ఊహాగానాలు వినిపించాయి. ఈ తరుణంలో ఖర్గేతో, రాహుల్‌తో శశిథరూర్ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం థరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ' మా ఇద్దరి నాయకులతో మాట్లాడాను. మా చర్చలు సానుకూలంగా జరిగాయి. అంతా బాగానే ఉంది. మేము కలిసి నడుస్తాము. ఇంకేం చెప్పగలను. నేను ఎప్పుడూ పార్టీ కోసం ప్రచారం చేశాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడా ప్రచారం చేయలేదు' అని అన్నారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? సిఎం పదవి గురించి ఈ సమావేశంలో చర్చించారా అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఈ విషయంపై మేము మాట్లాడుకోలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి నాకు ఇష్టం



లేదు. ప్రస్తుతానికి నేను ఎంపిని. తిరువనంతపురం నుండి నా ఓటర్ల విశ్వాసం నాకు ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను నేను చూసుకోవాలి. అది నా పని' అని ఆయన అన్నారు. ఈరోజు ఖర్గేతో, రాహుల్‌గాంధీతో చర్చలు సజావుగా సాగినందుకు వారికి శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక · ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
శుక్రవారం 30 జనవరి 2026


# బయటపడ్డ భారత్ బలహీనత!

స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ తొలి ఓటమి చవిచూసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాలతో భారత్ జోరు మీదుండడంతో క్వీన్‌స్వీప్ పక్కా అని ఫ్యాన్స్ భావించారు. కానీ, బుధవారం విశాఖపట్టణంలో జరిగిన నాలుగో మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో కివీస్ నెగ్గింది. 216 పరుగుల భారీ ఛేదనలో భారత్ 18.4 ఓవర్లలో 165 స్కోర్‌కే పరిమితమైంది. దీంతో టీమ్ఇండియా అభిమానుల్లో ఓ విషయంపై ఆందోళన నెలకొంది. పొట్టి ఫార్మాట్‌లో టీమ్ఇండియా దూసుకుపోతున్నప్పటికీ, టీ20 వరల్డ్‌కప్ ముంగిట ఓ అంశం కలవరపెడుతోంది. టీ20ల్లో ఇప్పటికే భారత్ వరుసగా 11 సిరీస్‌ల్లో విజయం సాధించి జోష్‌లో ఉంది. అయితే 210ం పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మాత్రం తడబాటుకు గురవుతోంది. జట్టులో స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ టీ20 చరిత్రలో టీమ్ఇండియా ఇప్పటిదాకా 210 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఒక్కసారి కూడా ఛేదించలేదు. దీంతో ఇది వరల్డ్‌కప్ ముంగిట భారత్‌కు బలహీనతే అని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. భారత్ ం20 క్రికెట్‌లో ఇప్పటిదాకా 118 సార్లు ఛేజ్ చేసింది. అందులో 80 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఇందులో ఒక్క మ్యాచ్‌లో కూడా 210ం టార్గెట్ లేకపోవడం గమనార్హం. మరో 34 టీ20ల్లో ఓటమి పాలైంది. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల ఫలితాలు తేలలేదు. వాస్తవానికి టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్ చేసిన సందర్భాల్లో భారీ స్కోర్లు సాధించింది. ఈ సిరీస్‌లోనూ మూడో మ్యాచ్‌లో 154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలోనే అందుకొని రికార్డు సృష్టించింది. అయితే ఆ తర్వాత మ్యాచ్‌లో మాత్రం డీలా పడిపోయింది. సిరీస్‌లో జోష్‌మీదున్న భారత్ 216 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోవడం అభిమానులకు నిరాశ కలిగించింది. త్వరత్వరగా వికెట్లు పడడం, ఒత్తిడి పెరిగిపోవడంతో ఓటమి చవిచూసింది. ఈ నేపథ్యంలో టీ20ల్లో 210 కంటే ఎక్కువ పరుగులు సాధిస్తే భారత్‌పై విజయం ఖాయం అనే పరిస్థితి తలెత్తింది. ఇది ప్రత్యర్థులకు అవకాశంగా మారుతోంది. ఒకవేళ తొలుత బ్యాటింగ్ చేసి 201కంటే ఎక్కువ రన్స్ చేస్తే, టీమ్ఇండియాను ఒత్తిడిలోకి నెట్టవచ్చు అని భావించే అవకాశం ఉంది. అందుకే ఇప్పటికైనా భారీ ఛేదనలో టీమ్ఇండియా ఒత్తిడికి లోనవకుండా, ఎంతటి లక్ష్యాన్నైనా అందుకునేలాగా జట్టులో మార్పు రావాలని ఆశిస్తున్నారు. మరో 9 రోజుల్లో పొట్టి కప్పు టోర్నమెంట్ షురూ కానుంది. ఇది మెగా టోర్నమెంట్ కాబట్టి, ఇందులో మేటి జట్లతోనూ ఆడాల్సి ఉంటుంది. ముఖ్యంగా నాకౌట్ మ్యాచ్‌ల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తితే, పట్టు వీడకుండా పోరాడాల్సిందే. లేదంటే టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉంది.





## ఓటమితో గుణపాఠం నేర్చుకున్నాం

**టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**

వైజాగ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో ం20 మ్యాచ్‌లో భారత జట్టు 50 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. సొంత గడ్డపై భారత్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమిగా నమోదైంది. గతంలో దక్షిణాఫ్రికా చేతిలో 51 పరుగుల తేడాతో ఓడిపోయింది. సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకున్న భారత జట్టు, ఈ మ్యాచ్‌లో పలు ప్రయోగాలకు దిగింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పోస్ట్-మ్యాచ్ ఇంటర్వ్యూలో పేర్కొన్న ప్రకారం, జట్టు ఒక బ్యాట్స్‌మెన్‌ను తగ్గించుకుని, ప్రారంభంలో రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత 180-200 లక్ష్యాన్ని ఛేదించాలనే ఇలా చేశామని చెప్పాడు. మొదట బ్యాటింగ్‌లో అద్భుతాలు చేశాం. ఒకవేళ 180 లేదా 200 చేజ్ చేయాలనుకున్నప్పుడు రెండు లేదా మూడు వికెట్లు కోల్పోతే మిగిలిన బ్యాటర్లు ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది ఆలోచించాం. ప్రపంచకప్ స్క్వాడ్‌లో ఉన్న ఆటగాళ్ల అందరికి ఛాన్స్ ఇవ్వాలనుకున్నాం. ఇట్స్ ఏ గుడ్ చాలెంజ్. మళ్లీ అవకాశం వస్తే ఈసారి చేజ్ చేస్తాం. గుణపాఠం నేర్చుకున్నాం' అని సూర్య అన్నాడు. న్యూజిలాండ్ 215 పరుగులు చేయగా, భారత్ ఛేదనలో 165 పరుగులకే ఆలౌట్ అయింది. శివమ్ దూబే 23 బంతుల్లో 65 పరుగులు చేసి అద్భుతమైన పోరాటం కనబరిచాడు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ రెండు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీశారు. న్యూజిలాండ్ తరపున టిమ్ సైఫర్ట్, డెవాన్ కాన్వే బలమైన భాగస్వామ్యం నెలకొల్పగా, మిచెల్ సాంట్నర్ అద్భుతమైన బౌలింగ్ (3/26)తో రాణించాడు. ఈ ఓటమి టీ20 ప్రపంచ కప్ ముందు జట్టుకు కొన్ని పాఠాలను నేర్పింది.

# ప్రొఫెషనల్ మీటింగ్‌ను పుకార్లుగా మార్చారు



భారత్ క్రికెట్ చరిత్రలో యువరాజ్ సింగ్ పేరు ఒక సంచలనం. మైదానంలో సిక్సర్ల వర్షం కురిపించినా, ప్రాణాంతక క్యాన్సర్‌ను జయించి తిరిగి వచ్చినా, ఆయన ఒక పోరాట యోధుడిగా నిలిచారు. అయితే రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో యువరాజ్ కేవలం తన ఆట వల్ల మాత్రమే కాకుండా, గాసిప్ కాలమ్స్‌లో వచ్చే వార్తల వల్ల కూడా వార్తల్లో ఉండే వారు. తాజాగా తన వ్యక్తిగత జీవితంపై దశాబ్దాలుగా ప్రచారంలో ఉన్న కొన్ని తీవ్రమైన పుకార్లను యువరాజ్ పటాపంచలు చేశారు. టెన్నిస్ స్టార్ సానియా మీర్జా నిర్వహిస్తున్న సర్వింగ్ అప్ విత్ సానియా అనే యూట్యూబ్ షోలో పాల్గొన్న ఆయన మీడియా సృష్టించిన మిస్టరీల వెనుక ఉన్న అసలు నిజాన్ని బయటపెట్టారు. యువరాజ్ సింగ్ తన ఆట రోజుల్లో ఎదుర్కొన్న అత్యంత వివాదాస్పద కథనాలలో ఒకటి మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆయన ఒక అజ్ఞా యువతిని కలిశారని రాయడం అప్పట్లో ఇది పెద్ద సంచలనంగా మారింది. అయితే. ఆ మిస్టరీ గర్ల్ ఎవరు అన్న ప్రశ్నకు యువరాజ్ ఇప్పుడు సమాధానం ఇచ్చారు. ఆమె మరెవరో కాదు, యువరాజ్ సింగ్ మేనేజర్." నేను అప్పుడే ఆమెను కలిసి పని చేయడం ప్రారంభించాను. నేను నా మేనేజర్‌ని అనుకోకుండా కలిశాను. ఆమెను పలకరిస్తూ కౌగిలించుకున్నాను. మీరు ఎవరినైనా కలిసినప్పుడు ఇచ్చే సాధారణ కౌగిలింత అది. కానీ మీడియా దాన్ని మ్యాచ్ మధ్యలో జరుగుతున్న ప్రేమ వ్యవహారంగా చిత్రీకరించింది" అని యువరాజ్ సింగ్ గుర్తు చేసుకున్నారు. ఒక వృత్తిపరమైన పలకరింపును క్రమశిక్షణా రాహిత్యంగా మార్చడం తనను ఎంతగా నిరాశరిచిందో ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ప్రతికూల లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేయకపోతే ప్రజలు చదవరని వారు భావిస్తారు. అక్కడ సానుకూలత కంటే ఎక్కువ నెగిటివిటీ ఉంది. అని యువరాజ్ వ్యాఖ్యానించారు. సాధారణ హావభావాలను కూడా కుంభకోణాలుగా మార్చడం వల్ల అథ్లెట్‌ల వాస్తవికత ప్రజలకు ఎంత తప్పుగా చేరుతుందో అని ఆయన విశ్లేషించారు. కేవలం సీరియస్ అంశాలే కాకుండా తన గతాన్ని సరదాగా గుర్తు చేసుకుంటూ ఒక వింత ఘటనను యువరాజ్ పంచుకున్నారు. 2007-08లో జరిగిన ఆస్ట్రేలియా పర్యటనలో ప్రముఖ నటితో డేటింగ్ చేసేవారు. ఆ సమయంలో జరిగిన పొరపాటు వల్ల జట్టు బస్సు ఎక్కే క్రమంలో యువరాజ్‌కు వింత అనుభవం ఎదురైంది. ఆ నటి పొరపాటున యువరాజ్ బూట్లను ప్యాక్ చేయడంతో ఆయనకు తన బూట్లు దొరకలేదు. దీంతో చేసేదేమీ లేక ఆ నటికి చెందిన పింక్ కలర్ స్లిప్పర్లను ధరించి బస్ ఎక్కాల్సి వచ్చింది.




# టెన్నిస్‌లో షేక్ హ్యాండ్ వివాదం!

టెన్నిస్ కోర్టులో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను తలపించేలా హై టెన్షన్ నెలకొంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సెమీఫైనల్ పోరులో క్రీడా స్ఫూర్తి కంటే రాజకీయ సెగలే ఎక్కువగా కనిపించాయి. ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలినా స్విటోలినా, బెలారస్ స్టార్ అరీనా సబలెంకా మధ్య జరిగిన ఈ మ్యాచ్ క్రీడాభిమానులను విస్మయానికి గురిచేసింది. సాధారణంగా టెన్నిస్ మ్యాచ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఆటగాళ్లు నెట్ వద్ద చేతులు హ్యాండ్‌షేక్ ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌లో ఈ సంప్రదాయం కనుమరుగైంది. వరల్డ్ నంబర్-1 అరీనా సబలెంకా మ్యాచ్ ప్రారంభానికి ముందు సంప్రదాయబద్ధంగా ఫొటోల కోసం సిద్ధమవ్వగా.. ఎలినా స్విటోలినా ఆమెతో కలిసి ఫొటో దిగడానికి నిరాకరించారు. ఆ తర్వాత నెట్ దగ్గరకు వచ్చినప్పటికీ.. ఇద్దరూ కనీసం కళ్లలోకి చూసుకోలేదు, షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రష్యా, బెలారస్ క్రీడాకారులతో చేతులు కలపకూడదనే ఉక్రెయిన్ ప్లేయర్ల నిర్ణయంలో భాగంగానే స్విటోలినా ఇలా చేశారు. రష్యాకు బెలారస్ మద్దతు ఇస్తున్న నేపథ్యంలో ఆ దేశ క్రీడాకారులతో చేతులు కలపడం తమ దేశ ప్రజలను అవమానించడమేనని స్విటోలినా భావిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఉక్రెయిన్ పక్షాన ఒక బలమైన రాజకీయ సందేశాన్ని ఇస్తున్నట్లు ఆమె గతంలోనే స్పష్టం చేశారు. కేవలం షేక్ హ్యాండ్ విషయంలోనే కాకుండా, మ్యాచ్ జరుగుతున్న సమయంలోనూ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒక ర్యాలీ సమయంలో సబలెంకా గట్టిగా అరవడంతో, అంపైర్ దానిని 'హిండ్రెన్స్' (ఆటకు ఆటంకం)గా పరిగణించి పాయింట్ కట్ చేశారు. అంపైర్ నిర్ణయంపై సబలెంకా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వీడియో రివ్యూ కావాలని పట్టుబట్టి అంపైర్‌తో వాదించడంతో ఆట కాసేపు నిలిచిపోయింది. దీంతో మైదానంలో వాతావరణం మరింత వేడెక్కింది. ఇదిలా ఉండగా.. మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో ఎలినా స్విటోలినాపై ఘనవిజయం సాధించి అరీనా సబలెంకా వరుసగా నాలుగోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రాజకీయ ఉద్రిక్తతల మధ్య సాగిన ఈ పోరులో సబలెంకా తన దూకుడుతో అభిమానులను అలరించింది. రొడ్ లేవర్ ఎరీనాలో జరిగిన ఈ హై-వోల్టేజ్ పోరులో సబలెంకా 6-2, 6-3 తేడాతో స్విటోలినాను మట్టికరిపించింది. కేవలం 1 గంట 16 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ గెలుపుతో సబలెంకా ఒక అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఓపెన్ ఎరాలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన మూడో క్రీడాకారిణిగా నిలిచింది.


# మహేష్‌బాబు నా ఫేవరేట్ తెలుగు హీరో

**టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ**



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటే తనకు చాలా ఇష్టమని టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తెలిపాడు. ఖాళీ సమయంలో మహేష్ బాబు సినిమాలు చూస్తానని, ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడే సమయంలో తెలుగు సినిమాల గురించి సహచర ఆటగాళ్లతో బాగా చర్చిస్తానని చెప్పుకొచ్చాడు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమా తనకు పిచ్చెక్కించిందని తెలిపాడు. ఈ సినిమాలోని అల్లు అర్జున్ మేనరిజమ్ తనను బాగా ఆకట్టుకుందని చెప్పాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో అభిషేక్ శర్మ దుమ్మురేపుతున్నాడు. తొలి టీ20లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగిన అభిషేక్.. రెండో టీ20లో మాత్రం గోల్డెన్ డకౌట్ అయ్యాడు. మూడో టీ20లో మరోసారి తన విశ్వరూపం చూపించాడు. 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది 10 ఓవర్లలోనే మ్యాచ్ ముగించాడు. నాలుగో టీ20లో మరోసారి అభిషేక్ శర్మ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ప్రత్యర్థి బౌలర్లకు సింహ స్వప్నంగా మారిన అభిషేక్ శర్మ.. టీమిండియాకు కీలక ప్లేయర్‌గా ఎదిగాడు. ఎంతలా అంటే అభిషేక్‌ను ఔట్ చేస్తే మ్యాచ్ గెలిచినట్లేనని ప్రత్యర్థి కెప్టెన్లు ఫీలయ్యేంత. గతంలో విరాట్ కోహ్లి ఈ స్టార్‌డమ్‌ను సొంతం చేసుకోగా.. అతని స్థానాన్ని అభిషేక్ శర్మ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న అభిషేక్ శర్మ.. తెలుగు అభిమానులకు సుపరిచితమే. సినిమా, క్రికెట్ అంటే పడిచచ్చే తెలుగు ఫ్యాన్స్.. అభిషేక్ శర్మ ఫేవరేట్ తెలుగు హీరో గురించి తెలుసుకునేందుకు తెగ ఆరాటపడుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ నిర్వహించిన ఒక ఫన్ ఇంటర్వ్యూలో అభిషేక్ శర్మ.. తన ఫేవరేట్ తెలుగు హీరో మహేష్ బాబు అని తెలియజేశాడు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మహేష్ బాబు సినిమాల గురించి, ఆయనకు ఉన్న క్రేజ్ గురించి తన సహచర తెలుగు ఆటగాళ్లను అడిగి తెలుసుకుంటుంటానని చెప్పాడు. తాను తెలుగు సినిమా చూస్తానని, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమా బాగా నచ్చిందని చెప్పాడు. ఈ సినిమాలోని అల్లు అర్జున్ మేనరిజమ్స్‌ను మైదానంలో కూడా అనుకరించాడు. అల్లు అర్జున్ స్క్రీన్ ప్రెజెన్స్, డ్యాన్స్ ఇష్టమని ఓ ఇంటరాక్షన్‌లో తెలిపాడు. ఆర్ఆర్ఆర్ సినిమాపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపించాడు. ముఖ్యంగా నాటు నాటు పాట బాగుందని, ఎన్టీఆర్, రామ్‌చరణ్ అద్భుతమైని కొనియాడాడు. తెలుగు ప్లేయర్లు నితీష్ రెడ్డి, తిలక్ వర్మల సాయంతో తెలుగు డైలాగ్స్ నేర్చుకుంటానని చెప్పాడు. హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు చాలా ఇష్టమని, రామోజీ ఫిల్మ్ సిటీలో సినిమా షూటింగ్ చూడాలని ఉందని తెలిపాడు.

# భారత పర్యటనకు బంగ్లాదేశ్ గ్రీన్ సిగ్నల్!



'ఆకు వచ్చి ముల్లు మీద పడ్డా, ముల్లు వచ్చి ఆకు మీద పడ్డా చిరిగేది ఆకే' ... ఓ బలహీనుడు తనకు తానుగా బలవంతునితో తలపడినా.. బలవంతుడే వచ్చి బలహీనుడితో పోటీపడినా జరిగే నష్టం బలహీనుడికేనని చెప్పేందుకు ఈ సామెతను ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఈ సామెత బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. పాకిస్థాన్ మాటల పట్టుకోని భారత్‌తో కయ్యానికి కాలు దువ్విన బంగ్లాదేశ్‌కు అసలు తత్వం బోధపడింది. భారత్‌లో తమ ఆటగాళ్లకు భద్రత పొంచి ఉందని టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్.. ఇప్పుడు యూటర్న్ తీసుకుంది. క్రికెట్ టీమ్‌ను భారత్‌కు పంపించేందుకు నిరాకరించిన బంగ్లా ప్రభుత్వం.. తమ షూటింగ్ జట్టుకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫిబ్రవరి 2 నుంచి న్యూఢిల్లీ వేదికగా ప్రారంభం కానున్న ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇద్దరు సభ్యులతో కూడిన బంగ్లా షూటింగ్ బృందానికి ఆ దేశ ప్రభుత్వం అనమతిచ్చింది. ప్రస్తుతం ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఫిబ్రవరి భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లా క్రికెట్ బోర్డు చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. భారత్‌లో బంగ్లా ఆటగాళ్లకు వచ్చే భద్రతా సమస్య ఏం లేదని స్పష్టం చేసింది. దాంతో బంగ్లాదేశ్ టోర్నీ నుంచి తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. క్రికెట్ జట్టు విషయంలో కఠినంగా వ్యవహరించిన బంగ్లా ప్రభుత్వం.. షూటర్ల విషయంలో మాత్రం మెత్తబడింది. ఈ వ్యవహారంపై బంగ్లాదేశ్ స్పోర్ట్స్ సెక్రటరీ మెహబూబ్ ఉల్ ఆలం మాట్లాడుతూ.. షూటింగ్ టీమ్‌లో ఒక్క షూటర్, కోచ్ మాత్రమే ఉన్నారని, వారి భద్రతకు ముప్పులేదని భావించే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. షూటింగ్ ఇండోర్ గేమ్ కావడంతో ప్రేక్షకుల సంఖ్య పరిమితంగా ఉంటుందని చెప్పారు. భారత్ నుంచి పూర్తి భద్రతా హామీ కూడా లభించిందని పేర్కొన్నారు. ఐపీఎల్ 2026 సీజన్ వేలంలో కొనుగోలు చేసిన బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్‌ను విడుదల చేయాలని కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును బీసీసీఐ ఆదేశించింది. దాంతో కేకేఆర్ అతన్ని రిలీజ్ చేసింది. ఇది బంగ్లా ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. ముస్తాఫిజుర్ వంటి స్టార్ ప్లేయర్‌కే రక్షణ లేనప్పుడు, మొత్తం జట్టును ఎలా పంపుతామని బంగ్లా సాకుగా చూపింది. కానీ ఐసీసీ, భారత్ భద్రత విషయంపై హామీ ఇచ్చినా.. పాకిస్థాన్ మాటలు పట్టుకోని వినలేదు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) సెక్రటరీ జనరల్ పవన్ సింగ్ మాట్లాడుతూ, బంగ్లా షూటర్ల రాకపై తమకెలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. విదేశీ, క్రీడల మంత్రిత్వ శాఖల నుంచి అవసరమైన అన్ని అనుమతులు ఇప్పటికే లభించాయని, బంగ్లా బృందం జనవరి 31న ఢిల్లీకి చేరుకుంటుందని ఆయన ధృవీకరించారు..

# అమ్మా నీ ఆశీర్వాదమే నా బలం

## తల్లి అంజనాదేవి పుట్టినరోజు చిరు పోస్ట్

పదవులు, ఖ్యాతి, పేరు ఎంత ఉన్నా.. తల్లి ముందు మాత్రం ప్రతి కొడుకు చిన్నవాడే. అదే విషయాన్ని మరోసారి నిరూపించారు మెగాస్టార్ చిరంజీవి. కోట్లాది మంది అభిమానులకు ఆయన లెజెండ్ అయినా, తన తల్లి అంజనా దేవి ముందు మాత్రం ఒక సాధారణ కుమారుడిగా మారిపోతారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు అభిమానులను హత్తుకుంటోంది. జనవరి 29 అంజనా దేవి పుట్టినరోజు కావడంతో, చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'అమ్మా.. నీ ఆశీర్వాదమే నా బలం. పుట్టినరోజు శుభాకాంక్షలు' అంటూ ఎక్స్ లో ఓ ఎమోషనల్ మెసేజ్‌ను పంచుకున్నారు. ఈ సందేశంతో పాటు ఒక ప్రత్యేక వీడియోను కూడా అభిమానులతో షేర్ చేశారు. ఆ వీడియోలో మెగా కుటుంబ సభ్యులందరితో కలిసి అంజనా దేవి గడిపిన అరుదైన క్షణాలు, కుటుంబ వేడుకల ఫోటోలు, మధురమైన జ్ఞాపకాలు కనిపిస్తున్నాయి. ఈ విజువల్స్ అభిమానులను మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకులను కూడా భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. వీడియో విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ అంజనమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చిరంజీవి తన తల్లిపై ఉన్న ప్రేమను ఎప్పుడూ దాచుకోరు. ప్రతి ఏడాది ఆమె పుట్టినరోజు, మదర్స్ డే వంటి సందర్భాల్లో తప్పకుండా ఆమెను గుర్తు చేసుకుంటారు. షూటింగ్‌లు, రాజకీయ కార్యక్రమాలు, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా.. తల్లితో సమయం గడపడానికి చిరు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ విలువలు, క్రమశిక్షణ, ఓర్పు, సహనం వంటి గుణాలు తన తల్లి నుంచే నేర్చుకున్నానని చిరంజీవి పలు సందర్భాల్లో వెల్లడించారు. మెగా కుటుంబానికి అంజనా దేవి ఒక అండగా, ధైర్యంగా ఉంటారని చిరు ఎప్పుడూ చెబుతుంటారు. గత ఏడాది కూడా ఆమె పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు.





# వరుసగా సినిమాలతో ప్రభాస్ బిజీ

వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయి-ంలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాల్నైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.



# ఒప్పకోకుంటే లేచి పోదామనుకున్నం

## పెళ్లి వార్తలపై షాకింగ్ విషయాలు చెప్పిన కీర్తి సురేశ్

'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది. పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒక కల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.

# యుఫోరియాతో విజయం సాధిస్తా: గుణశేఖర్

కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకురావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నతస్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. నేటి యువతకు, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిదని ఆయన తెలిపారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.



# కొలువు దీరిన వనదేవతలు

**వడ్లూరు, గుండారం, తోటపల్లి , దేవక్కపల్లి గ్రామాలలో గద్దెలపై ఆసీనులైన అమ్మవార్లు.**

**ఎత్తు బంగారం ( బెల్లం) సమర్పించుకున్న మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ.**

**వనదేవతలకు ఎత్తు బంగారం ( బెల్లం) సమర్పించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్.**



జనత న్యూస్ బెజ్జంకి : భక్తులకు కొంగుబంగారమైన గిరిజన వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దేవతల జాతర మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మండలంలోని వడ్లూరు, గుండారం, తోటపల్లి, దేవక్కపల్లి గ్రామాలలో దేవతలు గద్దెలపై ఆశీనులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకుని ఎత్తు బంగారం ( బెల్లం) మొక్కులు సమర్పించి తన్మయత్వం చెందారు. గురువారం ఉదయం ఆయా గ్రామాల జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కోయ పూజారులతో కలిసి సమ్మక్కను డప్పు చప్పులు శివసత్తుల పూనకాల మధ్య వనం నుండి తీసుకొని వచ్చి గద్దెలపై ప్రతిష్టించడం జరిగింది. మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండల బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి గుండారం, దేవక్కపల్లి లో అమ్మవార్లకు ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించి దర్శించుకున్నారు.







# అల్గునూర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

**డివిజన్ కి ఎంతో చేశాం... ఇంకా చేస్తామన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**కాంగ్రెస్ అభ్యర్థి మల్లారెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి**



**తిమ్మాపూర్, జనతా న్యూస్ :** ప్రతీ ఎన్నికల్లో తనకు మెజార్టీనిచ్చిన అల్గునూర్ ప్రజల రుణం ఏం ఇచ్చినా తీర్చుకోలేనిదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయ.ణ అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అల్గునూర్ ఎనిమిదో డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా గోపు మల్లారెడ్డి నామినేషన్ సందర్భంగా మహిళలు, గ్రామస్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి అనురాధ, అభ్యర్థి గోపు మల్లారెడ్డి ఇంటింటా ఓటర్లను ఓట్లు అడుగుచూ ముందుకు సాగారు. 80 ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికే ఇచ్చినట్లు, మరో 50 ఇండ్లు ఇస్తామని, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తామని, డ్రైనేజీ పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామిచ్చారు. సెంట్రల్ లైటింగ్ త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. సీసీ రోడ్డు ప్రొసీడింగ్స్ సీపీవో వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రతీ కమ్యునిటీ హాలుకు రూ.5లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ తన వెంట ఇరవై ఏళ్ల నుండి మల్లారెడ్డి ఉన్నాడని, ఆయనతోపాటు అల్గునూర్ గ్రామస్తులు ఎంతో మంది తనతో ఉన్నారని, అల్గునూర్ అంటే తనకు ప్రత్యేక అభిమానం ఉందని, అల్గునూర్ లో ఎంతో అభివృద్ధి చేసినట్లు, ఇంకా చేస్తామని తెలిపారు. మొండి మనిషి, పట్టుదల మనిషి గోపు మల్లారెడ్డి అల్గునూర్ ప్రజల విషయంలో, అభివృద్ధి విషయంలో తనను ఒప్పించి నిధులు తీసుకొచ్చాడని, ఎలాంటి ఆపదలో ఉన్నా వారి వెంట ఉండే వ్యక్తి మల్లారెడ్డి అని, అందుకే ఆయనను కాంగ్రెస్ అభ్యర్థిగా అల్గునూర్ 8వ డివిజన్ నుండి పోటీ చేస్తున్నాడని. తప్పకుండా ఆదరించి ఫిబ్రవరి 11న జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం గుర్తించి పిలిచే వ్యక్తి మల్లారెడ్డి అని, ఆయనతో కలిసి తప్పకుండా అల్గునూర్ అభివృద్ధి విషయంలో తాము పని చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తనను గెలిపిస్తే అల్గునూర్ కి అధిక నిధులు తీసుకొచ్చి తప్పకుండా అభివృద్ధి చేసి చూపిస్తానని గోపు మల్లారెడ్డి ఓటర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, డాక్టర్ అనురాధ, నాయకులు తమ్మనవేని రమేష్, సల్ల రవీందర్, కంది అశోక్ రెడ్డి, చిందం కిష్టయ్య, దాసం నాగేందర్, రాఘవ రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మల్లెపల్లి ప్రభాకర్ ప్రకటనలతో పార్టీకి సంబంధం లేదు

**పి.వై.ఎల్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్ నాయక్ స్పష్టీకరణ**



హుస్నాబాద్,జనత న్యూస్: సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి పేరుతో మల్లెపల్లి ప్రభాకర్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్) రాష్ట్ర కార్యదర్శి సంతోష్ నాయక్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు పార్టీ అధికారిక నిర్ణయాలు కావని, శ్రేణులు ఎవరూ ఇటువంటి తప్పుడు ప్రచారాలను విశ్వసించవద్దని కోరారు. నెల రోజుల క్రితం సూర్యపేటలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించి, పార్టీ నిర్మాణ పనివిధానంలో కొన్ని మార్పులు చేపట్టామని ఆయన వివరించారు. ఆ సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం, పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి పేరుతో ఎలాంటి బహిరంగ ప్రకటనలు ఇవ్వకూడ దని నిర్ణయించామని గుర్తుచేశారు. ఈ నిర్ణయానికి విరుద్ధంగా, పార్టీలో ఎటువంటి చర్చ లేకుండా మల్లెపల్లి ప్రభాకర్ ఏకపక్షంగా తన వ్యక్తిగత నిర్ణయంతో ప్రజా సంఘాల రద్దుపై ప్రకటనలు చేయడం సరికాదని సంతోష్ నాయక్ పేర్కొన్నారు. దీనివల్ల కార్యకర్తలు గందర గోళానికి గురికావాల్సిన అవసరం లేదని, త్వరలోనే జరగబోయే పార్టీ ప్లీనరీ సమావేశాల్లో ప్రభాకర్ అనుసరించిన పార్టీ వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. అప్పటి వరకు పార్టీ ఐక్యతకు ఎలాంటి భంగం కలగదని విప్లవ అభిమానులకు స్పష్టం చేశారు.

# రెండో రోజుకు 26 నామినేషన్లు



హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ పురపాలక సంఘం రెండో సాధారణ ఎన్నికల సందడి మొదలైంది. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు గురువారం నాటికి మొత్తం 20 వార్డులకు గానూ ఇప్పటివరకు 26 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇందులో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులే అధికంగా ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి అత్యధికంగా పది మంది అభ్యర్థులు బరిలోకి దిగగా, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎనిమిది మంది, బీజేపీ నుంచి ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు. బహుజన సమాజ్ పార్టీ నుంచి ఒకరు, అలాగే ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు.జనవరి 28న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ శుక్రవారం (జనవరి 30)తో ముగియనుంది. గడువు ముగియడానికి మరో రోజు మాత్రమే సమయం ఉండటంతో చివరి రోజు అభ్యర్థుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.

# ఇందుర్తిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చిగురుమామిడి, జనత న్యూస్: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన బుర్కి జల రాజయ్యకు మంజూరైన 60 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును గురువారం గ్రామ సర్పంచ్ చింతపుల నరేందర్ ఆధ్వర్యంలో లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బాధితునికి సకాలంలో చెక్కు మంజూరు అయ్యేలా కృషి చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఈ సందర్భంగా అయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుమంత్, జి.పి.ఓ లు శ్రీనివాస్, బాలయ్య, వార్డు సభ్యులు ఉమ్మర్, కరోబార్ శంకరాచారి, ఓఎస్ శ్రీనివాస్, నాయకులు అందె పర్శరాములు, వేముల రాము, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహనీయులూ.. మన్నించండయ్యా..!

**రెండేళ్లుగా స్టోర్‌రూమ్‌లోనే జాతీయ నేతల చిత్రపటాలు**



చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని గునుకులపల్లె నూతన గ్రామపంచాయతీకి అందజేసిన 30 మంది మహనీయుల చిత్రపటాలు రెండేళ్లుగా స్టోర్‌రూమ్‌లోనే మూలుగుతున్నాయి. గ్రామపంచాయతీ ప్రారంభ సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి చిత్రపటాలను అందజేశారు. అయితే ఇప్పటివరకు వాటిని గోడలపై ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కూడా చిత్రపటాలను బయటకు తీయకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది జాతీయ నేతల పట్ల అవమానకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రైతులలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.8.05 కోట్లు**

**పరిపాలన అనుమతులు జారీ**

**మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఏఎంసి చైర్మన్ కంది తిరుపతి రెడ్డి**

హుస్నాబాద్, జనత న్యూస్:సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పనుల కోసం రూ. 805.50 లక్షలకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు. గురువారం హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ప్రతి ఏటా అకాల వర్షాలతో మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మార్కెట్ యార్డులో గోడౌన్లు, కవర్డ్ షెడ్డులు, లోతట్టు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 335 లక్షలు, మిగిలిన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 25 లక్షలు, విద్యుదీకరణ పనులకు రూ. 26 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అలాగే కాంపౌండ్ వాల్ వెంబడి ఇంటర్నల్ బాక్స్ డ్రెయిన్‌తో పాటు ఓపెన్ డ్రెయిన్ నిర్మాణానికి రూ. 400 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. గోడౌన్లకు షెడ్డులు, పీవీసీ గట్టర్లు, డౌన్ స్పౌట్‌ల కవరింగ్ కోసం ఎంఎస్ గట్టర్ల ఏర్పాటు పనులకు రూ. 19.50 లక్షలు కేటాయించినట్లు వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బంక చందు, బొలిశెట్టి శివయ్య మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు మంత్రికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి కృషితో భారీ నిధులు మంజూరుకావ డంపై మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ రైతుల పక్షాన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నంలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తణుకు ఆంజనేయులు, యాదవరెడ్డి, ఖుత్బుద్దీన్, రవి, బాలయ్య, బొంగోని శ్రీనివాస్,ఓరుగంటి భారతి దేవి పాల్గొన్నారు.

# పాత సీహెచ్‌సీ నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

**భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

**వాహనాల తనిఖీలకు ఆదేశాలు**



చేర్యాల, జనతా న్యూస్ : రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల పట్టణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఓల్డ్ సీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సందర్శించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శక వాతావరణంలో జరిగేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులతో మాట్లాడి తగిన సూచనలు చేశారు. అనంతరం చేర్యాలలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను కమిషనర్ సందర్శించారు. వాహనాల తనిఖీ తీరును పరిశీలించి, అక్రమ నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజలు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ బానోతు రమేష్, ఎస్సై నవీన్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాల, బస్తీ దవాఖానలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## మధ్యాహ్న భోజన పథకం, వైద్య సేవలపై కఠిన ఆదేశాలు



సిద్దిపేట, జనతా న్యూస్ ఎ 29 జనవరి 2026 : సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బిర్యానీ అన్నం, ఆలుగడ్డ--టమాటా కూరను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, కూరలో నీటి శాతం ఎక్కువగా ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలచటి కూరలతో ఇష్టానుసారంగా వంట చేస్తే సహించేది లేదని వంట సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థుల హాజరు ప్రకారం కొలతలతో ఆహార పదార్థాలు పంపిణీ చేయాలని, వంట పూర్తయ్యే వరకు టీచర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులు కూర్చున్న చోటికే వెళ్లి అన్నం, కూర వడ్డించాలని, భోజనం చేస్తున్న సమయంలో పిల్లలు లేవకూడదని స్పష్టం చేశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, రుచికరమైన ఆహారం విద్యార్థులకు కడుపునిండా అందేలా వంట చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంతకుముందు అదే ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కూడా మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించి మెనూ పాటించాలని ఆదేశించారు. అనంతరం అర్బన్ మండలం కేసీఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ ఒకేసారి రెండు కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు, మధ్యాహ్నం 12 గంటలకు మరో పీహెచ్‌సీకి వెళ్లారని సిబ్బంది వివరించారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించిన కలెక్టర్, నర్సింగ్ స్టాఫ్ బాలమణి ఒక్కరే విధుల్లో ఉండగా, సపోర్టింగ్ స్టాఫ్ రమ్య గైర్హాజరైన విషయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు విధులకు హాజరు కాని సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులకు సన్మానం

### 14వ డివిజన్ అధ్యక్షుడు అంకాలపు రాజును ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, జనతా న్యూస్ ఎ 29 జనవరి 2026 : కరీంనగర్ నగరంలోని 14వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన అంకాలపు రాజును మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘనంగా సన్మానించారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అంకాలపు రాజు పార్టీ కార్యవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అంకాలపు రాజుతో పాటు కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం డివిజన్ స్థాయిలో సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అంకాలపు రాజు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావుకు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా డివిజన్ స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు జిట్టవేణి పరుశురాములు, జనరల్ సెక్రటరీ శ్రీపతి కళ్యాణ్ కుమార్, యూత్ అధ్యక్షుడు జిట్టవేణి ప్రకాష్, యూత్ వైస్ ప్రెసిడెంట్ కటకం నటరాజు, డివిజన్ నాయకులు శ్రీపతి కిరణ్ కుమార్, చెరుకు ఆంజనేయులు, వెల్దండి సాయి కృష్ణ, బొద్దుల అరవింద్, నవకాంత్, రాజు పటేల్ తదితరులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

### రెండేళ్లలో అభివృద్ధి చేయని ప్రభుత్వాలు

# మూడేళ్లలో ఏమి చేస్తాయి?

### మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శ



కరీంనగర్, జనతా న్యూస్, 29 జనవరి 2026 : గత రెండేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని, కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, అలాంటివారు రానున్న మూడేళ్లలో ఏమి అభివృద్ధి చేస్తారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రంగా విమర్శించారు. గురువారం 47వ, 21వ డివిజన్ల బీఆర్ఎస్ అభ్యర్థులు చల్ల స్వరూపరాణి, చల్ల హరిశంకర్‌ల నామినేషన్ కార్యక్రమానికి గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా రాంనగర్‌లోని రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, డప్పు చప్పుళ్ల మధ్య భారీ ర్యాలీగా బయలుదేరి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలను ఉద్దేశించి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ నగరానికి "రెండు రూపాయలు కూడా" అభివృద్ధి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. పొన్నం ప్రభాకర్, బండి సంజయ్‌లతో సహా కాంగ్రెస్, బీజేపీ నాయకులు నగరానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.1650 కోట్లతో నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామని తెలిపారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పాలనలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని, బీజేపీ పార్టీ ఎన్నటికీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని అన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసమే పుట్టిన పార్టీ టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్‌గా చల్ల స్వరూపరాణి, చల్ల హరిశంకర్‌లు తమ డివిజన్లను అన్ని విధాల అభివృద్ధి చేశారని, ప్రజల ఇంటి బిడ్డలుగా సంక్షేమం కోసం పనిచేశారని ప్రశంసించారు. వారిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ మేయర్ హోదాలోనే ఇంత అభివృద్ధి జరిగితే, భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠం కైవసం చేసుకున్న తర్వాత ఒక మేయర్‌గా వారు తమ డివిజన్లను మరింతగా అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగుల కమలాకర్‌తో పాటు ఆయన సోదరుడు గంగుల సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు సిల్వర్ జోన్ అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు




కరీంనగర్, జనతా న్యూస్ ఎ 28 జనవరి 2026 : స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ పాఠశాలలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, ఇంగ్లీష్ భాషలో పట్టు సాధిస్తే అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్‌ను కేవలం భాషగా కాకుండా, విశ్లేషణాత్మకంగా ఆలోచించే సాధనగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ భాష ద్వారా ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో వి. వేదవిహార్ (4వ తరగతి), కె. సుకృత (5వ తరగతి), బి. తన్మయి (7వ తరగతి), టి. అమితా విక్రం (9వ తరగతి) తదితర విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. విజేత విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ నరేందర్ రెడ్డి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వనదేవతలకు మంత్రి మొక్కులు





హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ తల్లులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి తన మొక్కులలో భాగంగా వనదేవతలకు 'బంగారం' (బెల్లం) సమర్పించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రేకుర్తి సమ్మక్క-సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు: కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్, జనతా న్యూస్ : రేకుర్తి సమ్మక్క--సారలమ్మ వన దేవతల జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. గురువారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి జాతర ప్రాంగణాన్ని కమిషనర్ సందర్శించి, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పరిశీలించారు. సమ్మక్క--సారలమ్మ గద్దెలతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు కల్పించినట్లు చెప్పారు. భక్తులు వన దేవతలను దర్శించుకుని ప్రశాంతంగా మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గద్దెలకు చేరుకునేందుకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు, జాతర ప్రాంగణం అంతటా లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, చలువ పందిళ్లు, తాత్కాలిక వసతి సౌకర్యం, పార్కింగ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, బందోబస్తు, పారిశుధ్య పనులు తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. జాతర ప్రాంతంలో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు - 2026

### సిద్దిపేట జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు






సిద్దిపేట, జనతా న్యూస్, 29 జనవరి 2026 : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు--2026 సందర్భంగా సిద్దిపేట జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో గత 30 రోజులుగా జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేలా విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అతివేగంగా ప్రయాణిస్తున్న వాహనదారులపై చలానాలు విధించడం, పాఠశాలలతో కలిసి విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగింది. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించిన వాహనదారులను సన్మానించడంతో పాటు, ధరించని వారిపై చలానాలు విధించారు. హెల్మెట్ ప్రాముఖ్యతపై హెల్మెట్ ధరించిన వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట బస్టాండ్ ఆవరణలో మెడికల్ సిబ్బందితో కలిసి కంటి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, ఆటో, టాక్సీ డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గుండ్ల చెరువు గ్రామంలో సేఫ్ విలేజ్ క్యాంపెయిన్ ద్వారా పోలీస్ కళాకారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. రాజీవ్ రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాహనదారులకు భద్రతా సూచనలు చేశారు. హుస్నాబాద్ పట్టణంలో పాఠశాల పిల్లలతో ప్లకార్డ్స్ ర్యాలీ, పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ, గణతంత్ర దినోత్సవ సందర్భంగా రహదారి నిబంధనల ప్రాముఖ్యతపై శకట ప్రదర్శన వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు శంకర్ నారాయణ, యోగేశ్వర్ సింగ్ జాదవ్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ రెడ్డి, నేహా, పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com